RNI NO: APTEL/26/A5325

www.mahinewsindia.com

మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 62 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజీలు : 4 వెల రూ. 2 గురువారం -20 - ఆగస్టు - 2026

Published From :Chittoor circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన

గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి

బలూచిస్థాన్‌లో పాక్ దాడులు.. జోక్యం చేసుకోవాలంటూ ట్రంప్‌కు బలోచ్ నేతల లేఖ

30 మందికి పైగా పౌరులు మరణించారని ట్రంప్‌కు బలోచ్

అమెరికన్ కాంగ్రెస్ లేఖ

దాడుల్లో అమెరికా ఆయుధాలు వాడారా? అని విచారించాలని విజ్ఞప్తి

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు

రూ.200 కోట్ల పరిహారం

ఏడు పునరావాస కాలనీల్లో వేగంగా మౌలిక వసతుల కల్పన

- వెలిగొండ నిర్వాసితులకు సీఎం చంద్రబాబు భరోసా.. మరో రూ.200 కోట్ల పరిహారం విడుదల
- బాధితులకు శాసనసభ ప్రాంగణంలో చెక్కు అందించిన సీఎం చంద్రబాబు
- ఇప్పటివరకు నిర్వాసిత కుటుంబాలకు మొత్తం రూ.518 కోట్లు చెల్లింపు
- త్యాగాలు చేసిన నిర్వాసితులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి హామీ



అమరావతి: దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సమీపిస్తున్న వేళ, ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా పరిహారం అందించిన ప్రభుత్వం, మిగతా 2 లో

37 డిగ్రీ కాలేజీలకు కొత్త భవనాలు.. 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు

- రాష్ట్రంలో 37 డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామన్న మంత్రి
- 175 నియోజకవర్గాల్లో మోడల్ గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రణాళిక
- ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, కడప లైబ్రరీ 9 నెలల్లో పూర్తి చేస్తామని హామీ
- అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు సన్నాహాలు

అమరావతి: రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇందులో

కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందన్న ఖర్గే

ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపణ

కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపై నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శ



ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం నా రాజకీయ జీవితంలో చూడలేదు: చంద్రబాబు

- ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా చర్చిస్తేనే విలువ ఉంటుందన్న చంద్రబాబు
- వైసీపీ నేతలు అసెంబ్లీకి రాకుండా తప్పించుకోవడం వింతగా ఉందని వ్యాఖ్య
- జగన్ కు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందన్న సీఎం

ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ

- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా
- ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేంది
- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయి

అమరావతి: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మిగతా 2 లో

పెట్టుబడులే లక్ష్యం.. సీఎం రేవంత్ 10 రోజుల విదేశీ పర్యటన

యూకే, అమెరికాలో పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం

- ప్రఖ్యాత వర్సిటీలు, గ్లోబల్ సీఈవోలతో సమావేశాలు
- లండన్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహానికి హాజరు
- ఢిల్లీ సీడబ్ల్యూసీ భేటీ అనంతరం పయనం

హైదరాబాద్: తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, విద్యా రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. నేటి నుంచి (ఆగస్టు 20) ఆయన యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), మిగతా 2 లో

వచ్చే ఎన్నికల్లో

117 సీట్లు మావే

- గీత కార్మికులకు పింఛన్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటన
- వారి కోసం ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్ల పెంచుతామన్న సీఎం
- కేసీఆర్ సర్కార్ పిల్లల చదువులను విస్మరించిందని విమర్శలు
- హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్: తెలంగాణలోని గీత కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ గీత కార్మికుడికి పింఛను అందిస్తామని హామీ ఇచ్చారు. మిగతా 2 లో

22ఏ భూ బాధితులకు అండగా బీఆర్ఎస్

- తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూ బాధితులతో సమావేశం
- ప్రభుత్వం కుట్రతో భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చుతుంది
- కష్టాల్లో ఉన్న వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- మంచి మాటతో ప్రభుత్వం వినక పోతే ఎలాంటి పోరాటానికి అయినా సిద్ధం
- ముఖ్యమంత్రి,పొంగులేటికి రియల్ ఎస్టేట్ బాగా తెలిస్తే..బీఆర్ఎస్ నాయకులకు పోరాటాలు

భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి: జగన్

అమరావతి: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం
అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

ఢిల్లీ: జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు.

భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

హైదరాబాద్: భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం
నా రాజకీయ జీవితంలో చూడలేదు: చంద్రబాబు

అమరావతి: శాసనసభ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించిన వైసీపీ అధినేత జగన్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతిలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన సీఎం... ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం తన సుదీర్ఘ రాజకీయ జీవితంలోనే ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా చర్చిస్తేనే వాటికి సరైన గుర్తింపు, విలువ ఉంటాయని, సభకు హాజరుకాకుండా బయట ఎంత మాట్లాడినా ప్రాధాన్యత ఉండదని తెలిపారు. గతంలో తాను సవాల్ చేసి అసెంబ్లీ నుంచి బయటకు వచ్చినప్పటికీ, తమ పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం చివరి వరకు సభలోనే ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. కానీ వైసీపీ నేతలు మాత్రం సభకు రాకుండా తప్పించుకోవడం వింతగా ఆ ఉందని, ప్రజాస్వామ్యాన్ని చులకన చేస్తున్న జగన్‌కు అసలు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే జగన్ అసెంబ్లీ నుంచి తప్పించుకుంటున్నారని, డీఎస్సీ అంశంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తమ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించిందని, ఈ నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలు స్వాగతిస్తుంటే జగన్ ఇంకా బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను
ఆకట్టుకునే పనిలో మాయావతి!

ఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన 'దళిత-బ్రాహ్మణ' సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా వ్యవహారాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు. దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి "సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యమివ్వడంతో మరిన్ని సీట్లు కైవసం చేసుకోవచ్చని ఆమె ఆశిస్తున్నారు. గతంలో 2007లో "హాథీ నహీ గణేశ్ హై.. బ్రహ్మ, విష్ణు, మహేశ్ హై" అనే వినూత్న నినాదంతో బీఎస్పీ 206 స్థానాలను కైవసం చేసుకుని, 30 శాతం ఓట్ షేర్‌తో అధికార పీఠాన్ని అధిష్ఠించింది. ఆ తర్వాత ఎన్నికల్లో పార్టీ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానానికి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా స్థానాలకు పార్టీ పరిమితమైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుమారు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండగా, మాయావతి అనుసరిస్తున్న ఈ పాత ఫార్ములా ఆ పార్టీకి మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అనేది వేచి చూడాలి.

22ఏ భూ బాధితులకు అండగా బీఆర్ఎస్



హైదరాబాద్: 22ఏ భూ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు హామీ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కుట్రతో భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చుతుంది.కష్టార్జిత భూముల్లో ఉన్న వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. 22ఏ భూ బాధితుల కోసం బీఆర్ఎస్ లీగల్ సెల్ అందుబాటులో ఉంటుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందుబాటులో ఉంటారు. మంచి మాటతో ప్రభుత్వం వినక పోతే ఎలాంటి పోరాటానికి అయినా సిద్ధం.30 ఏళ్ల క్రింద రిజిస్ట్రేషన్ అయితే ఇప్పుడు ఎందుకు ఇబ్బంది అవుతుంది. నిషేధిత జాబితా నుండి తీసేయాలంటే 30 శాతం నుండి 50 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నారని అని చెబుతున్నారు. మంత్రి నిషేధిత జాబితా నుండి తీసేశారు.. ముఖ్యమంత్రి నిషేధిత జాబితాలో పెట్టించారు. ముఖ్యమంత్రి,పొంగులేటి రియల్ ఎస్టేట్ బాగా తెలిస్తే..బీఆర్ఎస్ నాయకులకు పోరాటాలు తెలుసు.ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదు. భువనగిరిలో 40 వేల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. సీఎంకు నాలుగు సార్లు చెప్పానని అన్నారు. ముఖ్యమంత్రి , పొంగులేటి భరధర్ చెయ్యి...అన్ని సజావుగా జరుగుతాయి.ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఎందుకు అవస్థలు పడాలి. నిషేధిత జాబితాలో పెట్టిన వారిని వెంటనే ముఖ్యమంత్రి కాపాడాలి.ముఖ్యమంత్రి తెలియకుండా ఏ ఒక్కటి జరగదు పొంగులేటి వెంటనే భరధర్ చేయాలి. 22ఏ నిషేధిత భూముల విషయంలో ఏ1 రేవంత్ రెడ్డి,ఏ2 పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎకరాల్లో కొని గజాల్లో అమ్ముతున్నారని ముఖ్యమంత్రి అంటున్నారు. హిల్ట్ పాలసీతో ఆస్తులు కొల్లగొడుతున్నారు.ప్రజలకు వినా అని ధరణి తొలగించారు. ప్రభుత్వం చేసిన కుట్ర.. వెంటనే సుమోటోగా స్వీకరించి తొలగించాలి.ఫోన్ ఆధారంగా భారతి సైట్ పని చేయడం లేదు. అవసరం అయితే ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తాం'అని పిలుపునిచ్చారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం

మొదటి పేజి తరువాయి

కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా పరిహారం అందించిన ప్రభుత్వం, తాజాగా మరో రూ.200 కోట్ల రూపాయల పరిహారాన్ని విడుదల చేసింది. ఈరోజు శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులకు ఈ చెక్కును అందజేశారు. ఈ విడుదలతో కలిపి ఇప్పటివరకు వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.518 కోట్ల మేర పరిహారం అందించినట్లయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎన్నటికీ మరవదని స్పష్టం చేశారు. "త్యాగం మీది, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మాది. వెలిగొండ నిర్వాసితులను గతంలో ఆదుకున్నది మా ప్రభుత్వమే, ఇప్పుడు కూడా అండగా నిలుస్తున్నాం. మిగిలిన పరిహారాన్ని కూడా వీలైనంత త్వరగా విడుదల చేస్తాం. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అండగా నిలిచి, తమకు భరోసా కల్పించడం పట్ల నిర్వాసిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు తెలిపారు.

రూ.518 కోట్లకు చేరిన పరిహారం

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా, సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద పరిహారం చెల్లిస్తున్నారు. గతంలో 2,557 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.318 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తాజాగా మరో 1,600 కుటుంబాలకు రూ.200 కోట్లను అందించింది. దీంతో మొత్తం 4,157 నిర్వాసిత కుటుంబాలకు రూ.518 కోట్ల పరిహారం అందింది. పరిహారంతో పాటు పునరావాసంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిర్వాసితుల కోసం మొత్తం 7 పునరావాస కాలనీలను అభివృద్ధి చేస్తుండగా, ఇప్పటికే వేములకోట మినహా మిగిలిన 6 కాలనీలలో మౌలిక సదుపాయాల పనులు పూర్తయ్యాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని వసతులు కల్పించడంతో నిర్వాసిత కుటుంబాలు తమకు కేటాయించిన ఇళ్లకు తరలివెళుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

37 డిగ్రీ కాలేజీలకు కొత్త భవనాలు.. 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు

అమరావతి: రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇందులో భాగంగా సొంత భవనాలు లేని 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించామని శాసనసభలో ప్రకటించారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ప్రస్తుతం ఆ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 103కి చేరిందని, కళాశాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రత్యేక పథకం కింద ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, ధ్వంసమైన ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అవసరమైన టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు ల్యాబ్స్, కంప్యూటర్లు, బెంచీలను ఎమ్మెల్యే కోటా నిధుల (గా4) కింద సమకూర్చుకోవాలని సూచించారు. ఒక్కో డిగ్రీ కళాశాల పూర్తిస్థాయిలో నిర్మించడానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుందని, దశలవారీగా అన్ని కాలేజీలకు మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో గ్రంథాలయాల వ్యవస్థను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని లోకేశ్ తెలిపారు. కడపలో గ్రంథాలయ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, రాబోయే తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గ్రంథాలయాలకు చెందాల్సిన సెస్సు నిధులను ట్రెజరీకి మళ్లించిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ నిధులను తిరిగి గ్రంథాలయ శాఖకు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

మంగళగిరిలో కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీ విజయవంతమైందని, రాత్రి 8 గంటల తర్వాత కూడా 300 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పూర్వ విద్యార్థులు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరిస్తే గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయవచ్చని పిలుపునిచ్చారు.

అమరావతి, విశాఖ, రాయలసీమల్లో భారీ లైబ్రరీలు

అమరావతిలో గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్, తెలుగు కల్చరల్ సెంటర్‌తో అనుసంధానించి దేశంలోనే అత్యుత్తమ సెంట్రల్ లైబ్రరీని నిర్మించనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. త్వరలోనే దీని డిజైన్ ఖరారు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. దీనికి దీటుగా విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్సిటీ కేంద్రంగా ఒక జోనల్ లైబ్రరీని, రాయలసీమ కేంద్రంగా మరో అత్యాధునిక జోనల్ లైబ్రరీని అన్ని హంగులతో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పుస్తక పఠనం పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతుందని, వారిని స్మార్ట్‌ఫోన్లు, ఐప్యాడ్‌లకు దూరం చేయడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

బలూచిస్థాన్‌లో పాక్ దాడులు.. జోక్యం చేసుకోవాలంటూ ట్రంప్‌కు బలోచ్ నేతల లేఖ

ఢిల్లీ: బలూచిస్థాన్‌లో పాకిస్థాన్ సైన్యం ఇటీవల జరిపిన వైమానిక దాడుల ఘటన తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ దాడుల్లో 30 మందికి పైగా పౌరులు మరణించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బలోచ్ అమెరికన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారా చంద్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. పాకిస్థాన్ దుశ్చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 12వ తేదీ తెల్లవారుజామున సురబ్ జిల్లాలోని గిదర్ ప్రాంతంలో నివాస గృహాలపై పాకిస్థాన్ వైమానిక దళం విచక్షణారహితంగా బాంబుల వర్షం కురిపించిందని, ఈ ఘటనలో మహిళలు, చిన్నారులతో సహా అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, భారీగా ఆస్తి నష్టం జరిగిందని బలోచ్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తారా చంద్ రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. "ఈ తీవ్రమైన ఆరోపణలపై మీ ప్రభుత్వం విచారణ జరపాలి. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన విమానాలు, ఆయుధాలు, డ్రోన్లు, టెక్నాలజీ లేదా ఇతర సైనిక పరికరాలు ఏమైనా ఉపయోగించారా? అనే విషయాన్ని నిర్ధారించాలి. ఒకవేళ అమెరికా సరఫరా చేసిన ఆయుధాలను దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు లభిస్తే, పాకిస్థాన్‌కు అందిస్తున్న సైనిక సహాయంపై సమీక్ష జరపాలి" అని ఆయన కోరారు. అంతేకాకుండా అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించిన ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తునకు అమెరికా మద్దతు ఇవ్వాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని తారా చంద్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు. "అధ్యక్షా.. ప్రపంచంలో ఏ చిన్నారి ప్రాణమైనా ఎంత విలువైందో, బలోచ్ చిన్నారి ప్రాణం కూడా అంతే విలువైంది. సాక్ష్యాలను ముందుగానే నిర్ధారించాలని మేము అమెరికాను కోరడం లేదు. వాస్తవాలను నిగ్గు తేల్చి, పౌరులను రక్షించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే కోరుతున్నాం" అని పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

పాక్ వాదనను తిప్పికొట్టిన బలోచ్ సంఘాలు

అయితే, ఈ ఆరోపణలను పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా విభాగం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) గట్టిగా ఖండించింది. ఇది వైమానిక దాడి కాదని, ఓ ఉగ్రవాద సంస్థకు చెందిన వాహనంలో అమర్చిన శక్తిమంతమైన బాంబు అనుకోకుండా పేలిపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని వివరణ ఇచ్చింది. పాక్ సైన్యం ఇచ్చిన ఈ వివరణను బలోచ్ కార్యకర్తలు, మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఐఎస్‌పీఆర్ ప్రకటన పూర్తిగా 'అబద్ధం, కల్పితం' అని కొట్టిపారేశాయి. పాక్ సైనిక ప్రతినిధి కార్యాలయం వివాదాస్పద సైనిక చర్యల విషయంలో తప్పుడు ప్రకటనలు చేయడంలో పేరుగాంచిందని ప్రముఖ బలోచ్ మానవ హక్కుల కార్యకర్త మీర్ యార్ బలోచ్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. "సురబ్ ఊచకోత అనేది ఒక ప్రణాళిక ప్రకారం జరిగిన సామూహిక శిక్ష. పాక్ వైమానిక దళం చీకటి మాటున ఉద్దేశపూర్వకంగా పౌరులనే లక్ష్యంగా చేసుకుని దాడి చేసిందనడానికి స్థానిక ప్రజలే సాక్షులు" అని ఆయన అన్నారు. 'బలోచ్ వాయిస్ ఫర్ జస్టిస్' (బీవీజే) అనే మరో సంస్థ కూడా పాక్ సైన్యం బలూచిస్థాన్‌లో చేస్తున్న 'యుద్ధ నేరాలను' కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి కట్టుకథలు అల్లుతోందని ఆరోపించింది.

వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలోని గీత కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ గీత కార్మికుడికి పింఛను అందిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ఆయన ఈ ప్రకటన చేశారు. గీత కార్మికుల జీవనోపాధిని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. వారి ఉపాధిని పెంచేందుకు ప్రభుత్వ భూములు, కాలువ గట్ల వెంబడి ఈత, తాటి చెట్లను విరివిగా పెంచుతామని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 5 లక్షల పరిహారం అందిస్తోందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వం గేదెలు, గొర్రెల పెంపకం వంటి కులవృత్తులను ప్రోత్సహించినట్టే చేసి, వారి పిల్లల చదువులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. తమ ఇందిరమ్మ పాలనలో బహుజనుల పిల్లలు చదువుకుని డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్ అధికారులు కావాలని ప్రోత్సహిస్తున్నామని, ఇదే నిజమైన సామాజిక న్యాయమని పేర్కొన్నారు. కేసీఆర్ చేసింది కుటుంబ న్యాయం అయితే, తాను చేస్తోంది సామాజిక న్యాయం అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రానికి కరవు రావాలని, రైతులు నష్టపోవాలని హరీశ్ రావు కర్ణాటక, తమిళనాడు వెళ్లి క్షుద్ర పూజలు చేస్తున్నారని విమర్శించారు. "క్షుద్ర పూజలు చేసే వారిని చెట్లకు కట్టేసి కొట్టాలి" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ, గౌడ కులస్తులు తమకు పూర్తి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులే లక్ష్యం.. సీఎం రేవంత్
10 రోజుల విదేశీ పర్యటన

హైదరాబాద్: తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, విద్యా రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. నేటి నుంచి (ఆగస్టు 20) ఆయన యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికాలో 10 రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 30న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈరోజు (ఆగస్టు 19) ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొననున్న సీఎం, సమావేశం ముగిశాక రాత్రికి ఢిల్లీ నుంచే నేరుగా లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20న లండన్‌లో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరవుతారు. పర్యటనలో భాగంగా తొలుత యూకేలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ యూనివర్సిటీల ప్రతినిధులతో సమావేశమవుతారు. బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సందర్శించడంతో పాటు, ఎమిరేట్స్ స్టేడియంలో ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్‌కు హాజరవుతారు. అనంతరం ఆగస్టు 23న అమెరికాకు బయలుదేరి వెళ్తారు. అక్కడ బోస్టన్‌లోని హార్వర్డ్, ఎంఐటీ క్యాంపస్‌లను సందర్శిస్తారు. నార్త్‌ఈస్టర్న్, వర్జీనియా టెక్ యూనివర్సిటీల ప్రతినిధులతోనూ భేటీ అవుతారు. న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన భాగంగా ఆగస్టు 27, 28 తేదీల్లో గ్లోబల్ సీఈవోలు, వెంచర్ క్యాపిటలిస్టులు, బహుళజాతి సంస్థల అధిపతులతో పారిశ్రామిక రౌండ్‌టేబుల్ సమావేశాలు జరగనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై సీఎం దృష్టి సారిస్తారు. వాస్తవానికి ఈ పర్యటనలో చైనా, జర్మనీలను కూడా చేర్చాలని భావించినప్పటికీ, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో దానిని యూకే, అమెరికాకే పరిమితం చేశారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ



ఢిల్లీ: ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళుతున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

సామాన్యుల ఆస్తుల రక్షణ బాధ్యత మాది

హైదరాబాద్: రాష్ట్రంలోని సామాన్యుల ఆస్తుల రక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని, న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళమూ ఈ ప్రభుత్వం తీసుకోదంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటికే పరిష్కార ప్రక్రియ ప్రారంభించినట్లు స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... "హైకోర్టు ఆదేశాలతో నిషేధిత జాబితా(22ఏ)లో భూములను నిక్షిప్తం చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో సాంకేతికంగా పొరపాట్లు జరిగాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతోంది. 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించాం. రెవెన్యూ శాఖ కార్యదర్శి, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. 15 రోజులపాటు కమిటీ దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తుంది.

వారికి నాకు అదే తేడా... భారాస నేత హరీశ్‌రావు ప్రజల సమస్యను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు బురదచల్లుతున్నారు. విమర్శలు చేయడం చాలా సులువు.. బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఏ విషయంలో పొరపాటును బహిరంగంగా అంగీకరించి సరిచేస్తున్నాం. పదేళ్ల భారాస పాలనలో ధరణిలో అనేక తప్పులు జరిగాయి. ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఏనాడైనా జరిగిన తప్పులకు బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా? తప్పులను అంగీకరించే ధైర్యం ఉందా? పదేళ్లు అధికారంలో ఉన్న ఆయనకు ఇప్పటికీ 30% కమీషన్లు ఎందుకు గుర్తుకొస్తున్నాయో ప్రజలకు తెలుసు. భారాస ఏ పద్ధతిలో పాలన సాగించిందో ప్రజలు మరిచిపోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న పరిణామాలకు హరీశ్ ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? నేను క్షేత్రస్థాయిలో అధికారులు చేసిన పొరపాటు గుర్తించి పరిష్కారం చూపే బాధ్యత తీసుకున్నా. వారికి నాకు అదే తేడా" అని చెప్పారు. భాజపా నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి బదులు ఇస్తూ.. "నాపై ఏదైనా ఆరోపణ చేస్తే ఆధారాలతో మాట్లాడాలి. నేను రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నా. ఒక్కరోజులో రూ.వేల కోట్లకు ఎదిగిన వ్యక్తిని కాదు" అని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.230కే సిమెంట్ బస్తా

హైదరాబాద్: ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న పేదలకు ఒక్కో సిమెంట్ బస్తాని రూ.230కే అందించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం సిమెంట్ కంపెనీల యాజమాన్యాలు అంగీకరించాయని అన్నారు. సచివాలయంలో సిమెంటు పరిశ్రమల యాజమాన్యాలతో పొంగులేటి సమావేశమై చర్చించారు. "రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. ఇందులో 85% ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయి. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున 2.50లక్షల ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఈ బృహత్తర పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలి" అని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రొఫెసర్లు చేయాల్సిన పని కార్మికులతో..
గ్రూప్-1లో భయంకరమైన అక్రమాలు: చంద్రబాబు

అమరావతి: వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. "గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారు? మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు. తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైంది. వైకాపా హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ" అని సీఎం చంద్రబాబు అన్నారు.

ప్రపంచ దేశాలు మొత్తం ఆంధ్ర రాష్ట్రం వైపు చూస్తున్నాయి

- టీడీపీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా

రాయచోటి, మహిన్యూస్, ఆగస్టు 19: ప్రపంచ దేశాలు మొత్తం ఆంధ్ర రాష్ట్రం వైపు చూస్తున్నాయని టీడీపీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు పాలనను మెచ్చి ప్రపంచవ్యాప్తంగా వ్యాపారవేత్తలు ఆంధ్ర రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ ఒక్కటే అని గాజుల ఖాదర్ బాషా తెలిపారు. స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్ ఒక చరిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అమావాస్య రెడ్డయ్య, అమీర్ భాష, అబ్దుల్, రోఫా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కార్యక్రమాల లో మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి

గాలివీడు: ఆగష్టు19(మహి న్యూస్): రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి గాలివీడు మండలంలో వివిధ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కేంద్రంఆర్య శంకర్ కోలపారం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం, అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ అనుపత్రి ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ఆర్య శంకర్ కోలపారం నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం నూతన ఫిజియోథెరపీ అనుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలివీడు మండలం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి, లక్కీరెడ్డి పల్లి మార్కెట్ డైరెక్టర్ పురం రామాంజులు, టిడిపి నాయకులు కానాల లోకేష్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి, సంపత్ నాయక్, జెకేరియా, లక్ష్మయ్య, టిడిపి కుటుంబ సభ్యులు, నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లూరు గంగమ్మ తల్లి దేవాలయానికి బీరువా వితరణ

రాయచోటి, మహిన్యూస్, ఆగస్టు 19 : రాయచోటి మండల పరిధిలోని వల్లూరువాండ్లపల్లెలో గల వల్లూరు గంగమ్మ తల్లి దేవస్థానం లో నూతనంగా పోతుల రాజు సింహద్వారము, బలిపీఠములను నూతనంగా గ్రామ ప్రజలు ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా వల్లూరువాండ్లపల్లెలో ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు వల్లూరు గంగమ్మ తల్లి దేవాలయం పూజారి వల్లూరు గురివిరెడ్డికి నూతన బీరువాను, 50 పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అర్చకులు గురువు రెడ్డి మాట్లాడుతూ చదువు చెప్పడంతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండడం చాలా మంచిది అన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రభాకర్ రెడ్డి అన్న ప్రసాదము వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరు వాండ్ల గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు విరివిగా పాల్గొన్నారు

డీసీఓ దాదా పీర్‌కు ఘన వీడ్కోలు
నూతన డీసీఓ ఉదయ్‌శ్రీకి స్వాగతం

డీసీసీ కార్యాలయంలో విద్యార్థి, కుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం

అందరినీ సమన్వయం చేస్తూ సేవలందించిన దాదా పీర్

అనంతపురం, మహి న్యూస్ ఆగస్టు 19 అనంతపురం జిల్లా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ) దాదా పీర్‌కు విద్యార్థి, కుల, ప్రజాసంఘాలు, మేధావుల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధ్యతల నుంచి విరమణ పొందుతున్న డీసీఓ దాదా పీర్‌తో పాటు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీసీఓ ఉదయ్‌శ్రీని డీసీసీ కార్యాలయంలో సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విలేకరులు, సంఘాల నాయకులు మాట్లాడుతూ.. 2026--27 విద్యాసంవత్సరంలో తీవ్రమైన అడ్మిషన్ల ఒత్తిడి ఉన్నప్పటికీ డీసీఓ దాదా పీర్ ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. జిల్లా పరిధిలోని 16 గురుకుల పాఠశాలల్లో నెలకొన్న వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపారని తెలిపారు.

ఒకవైపు విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తూనే, మరోవైపు విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, ప్రజాసంఘాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ వివాదరహితంగా సేవలు అందించారని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారంలో ఆయన వహించిన బాధ్యతాయుతమైన పాత్ర అందరికీ మార్గదర్శకమని అన్నారు. నూతన డీసీఓగా బాధ్యతలు చేపట్టిన ఉదయ్‌శ్రీ కూడా గురుకుల పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక మధు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, అప్ప కమిటీ మద్దతు వెంకి మల్లేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిన్న పెద్దన్న, జయరాం, జై భీమ్ పార్టీ గట్టు రామాంజనేయులు, ఎంఎస్ఎఫ్ నగేష్, ఎంఆర్పిఎస్ పృథ్వి, ఏపీఎస్ఎఫ్ హేమంత్, మున్నూరు స్వామి, రామాంజనేయులు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు
వరుణ జపం మరియు వరుణ హోమం

చిత్తూరు జిల్లా బంగారుపాలెం ఆగస్టు 19.: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలం మొగిలి శ్వర స్వామి దేవస్థానం నందు కమీషనరు హిందూ దేవాదాయశాఖ విజయవాడ వారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో విస్తారంగా వానలు పడాలని , రాష్ట్రం సుభిక్షంగా వుండాలని ఆలయములో వరుణ జపం మరియు వరుణ హోమం నిర్వహించవలసినదిగా ఆదేశించారు.వారి ఆదేశాల మేరకు బుధవారం రోజు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు వరుణ జపం మరియు వరుణ హోమం నిర్వహించడం జరిగినది. ఆలయము నందు రెండు ప్రధాన కలశములను ఏర్పాటు చేసి వాటికి శాస్త్రోక్తంగా గణపతి పూజ ,వరుణ పూజ అనంతరం నిర్వహించి ఆలయము వెలుపల గల కోనేరు వద్ద ముగ్గురు రుత్వికులు చేత వరుణ జపం కార్యక్రమం చేయడం జరిగినది. తదుపరి వరుణ జపం పూర్తి అయిన తరువాత ఆలయము లోపల ఐదుగురు రుత్వికుల చేత వరుణ హోమం, నైవేద్యం పూర్ణాహుతి అనంతరం ప్రతిష్టించిన కలసం తీసుకొని వెళ్ళి స్వామి వారికి అభిషేకం,హారతి నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమములో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం.బి .విజయకుమార్ , కార్యనిర్వహణాధికారి ఎ. మునిరాజ ఆలయ అర్చకులు గంగాధర్ గురుకుల్, సోము గురుకుల్, పవన్ గురుకుల్, దండపాని గురుకుల్ , కార్తిక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం..!!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ ఆగస్టు 19: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు వివరించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సంబంధిత పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖల కమిషనర్లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కడప కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పాల్గొనగా.. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి డీఆర్వో కె. మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, కేఎంసీ కమిషనర్ భవానీప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. అన్ని జిల్లాల కలెక్టర్ లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అన్ని రకాల ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఓటర్ల జాబితాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బంది సమీకరణ, శిక్షణ, ఎన్నికల సామగ్రి తదితర అంశాలపై అధికారులు చేపడుతున్న చర్యలను వివరించారు. గతంలో గ్రామ పంచాయతీ, జెడ్పిటిసి, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని 39 మండలాల పరిధిలో 619 గ్రామపంచాయతీలు, 6,004 వార్డులు ఉన్నాయని, మొత్తం 11,84,815 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు నిర్వహించని 8 గ్రామపంచాయతీలకు సంబంధించి న్యాయస్థానాల ఉత్తర్వులు, ఎన్నికల బహిష్కరణ తదితర అంశాలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగుతోందని, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఆగస్టు 23న, తుది జాబితాను ఆగస్టు 31న ప్రచురించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం నిర్వహిస్తున్నామని, ఇంటింటి సర్వే ఆగస్టు 18 నుంచి 22 వరకు, ఓటర్ల గుర్తింపు, ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, విచారణ అనంతరం గ్రామసభల ద్వారా జాబితాల ధ్రువీకరణ చేపట్టి సెప్టెంబర్ 7న తుది జాబితాలను ప్రచురించేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పత్రాల ముద్రణకు కావాల్సిన కాగితం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై కూడా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.



జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

మదనపల్లె, మహి న్యూస్, ఆగస్టు 19: జిల్లాలో నిర్వహించనున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కు వివరించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మదనపల్లె కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల మ్యాపింగ్, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, ఎన్నికల సామగ్రి అవసరాల అంచనా, సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ప్రతి పంచాయతీ, మండలం, మున్సిపాలిటీకి ఎన్నికల అధికారుల నియామకం తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 411 గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రస్తుతం ఎటువంటి సమస్యలు లేవని తెలిపారు. పోల్ కమ్యూనికేషన్ ప్రక్రియ పూర్తయిందని, పోలీస్ స్టేషన్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైందని, నిర్ణయించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు పనుల వేగాన్ని మరింత పెంచుతామని చెప్పారు. కోర్టు కేసుల కారణంగా ప్రభావితమైన యూఎల్‌బిలకు సంబంధించి అవసరమైన సన్నాహక పనులు పూర్తయ్యాయని, తదుపరి కోర్టు తీర్పు మరియు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లాలో సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల గుర్తింపునకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీతో సమావేశం నిర్వహించి గొడవలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నామని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గత ఒకటి రెండు నెలలుగా అసాంఘిక శక్తులపై నిఘా, నియంత్రణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఇతర జిల్లాల నుంచి సమకూర్చుకోవాల్సి ఉందని, ఇందుకోసం అధికారులను పంపించి అవసరమైన సమాచారాన్ని త్వరలో అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన అన్ని సూచనలు, మార్గదర్శకాలను నమోదు చేసుకున్నామని, వాటిని నిబంధనల ప్రకారం అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, ఎస్టీఎస్డబ్ల్యూ జిల్లా అధికారి అమర్నాథ్ రెడ్డి, మదనపల్లె, రాయచోటి, పుంగనూరు, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు ప్రమీల, రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దాల్మియా ప్రభావిత గ్రామస్తుల పరిహారం, పునరావాసం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..!

కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
సంస్థ యాజమాన్యం, రెవెన్యూ అధికారులతో సమావేశం

కడప, మహి న్యూస్ ఆగస్టు 19: దాల్మియా పరిశ్రమ ప్రభావిత గ్రామాల ప్రజలకు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నిబంధనల మేరకు అమలు చేసి, వారికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను, దాల్మియా సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన హామీలు, తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని అంశాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాధిత ప్రజలకు అందాల్సిన పరిహారం, పునరావాస చర్యలు, అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ పరిశ్రమను సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, యువ నాయకుడు భూపేష్ రెడ్డితో కలిసి సమీపంలోని దుగ్గనపల్లె ఆలయం వద్ద ప్రభావిత గ్రామాల ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను వివరించడంతో, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. దుగ్గనపల్లి గ్రామ పునరావాసానికి ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందని ఆర్డీవో శిరీష తెలిపారు. చిన్నకొమెర్ల గ్రామంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి, 60 కుటుంబాలకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు అందించిన విధానంలోనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం అందించేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమ కాంపౌండ్ వాల్ కారణంగా వర్షాలు, వరదల సమయంలో సహజ నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయన్న ఫిర్యాదులపై కూడా సమీక్షించారు. సమస్య పరిష్కారానికి వంకను విస్తరించాలని నిర్ణయించి, అంచనా వ్యయాన్ని సిద్ధం చేసి పనులను సాగునీటి శాఖకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ముతో పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రభావిత రైతులకు రాబోయే పంట కాలానికి ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరాన్ని బట్టి విత్తనాలు, ఎరువుల రూపంలో కూడా సహాయం అందించేలా ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నవాబ్‌పేట ప్రాంతంలో మైనింగ్, బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలనతో సమగ్ర సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పురోగతిపైనా సమీక్షించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. పునరావాసం, పరిహారం, వంక విస్తరణ, పంట నష్టానికి సహాయం, దెబ్బతిన్న ఇళ్ల సర్వే తదితర చర్యలను వేగవంతం చేసి ప్రభావిత గ్రామాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, హౌసింగ్ పీడి రాజారత్నం, రెవెన్యూ అధికారులు, దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కుప్పంలో సూర్య ఘర్ కోసం ఇంటింటి సర్వే

మహిన్యూస్ కుప్పం, ఆగస్టు 19: సూర్య ఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా కుప్పం నియోజకవర్గంలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. రెండో దశలో నియోజకవర్గ పరిధిలోని సుమారు 43 వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటిని సందర్శిస్తున్న సిబ్బంది ఆయా ఇళ్ల విద్యుత్ అవసరాలను పరిశీలిస్తున్నారు. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసేందుకు అనుకూలత, విద్యుత్ వినియోగం తదితర అంశాలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వే పూర్తయిన అనంతరం అర్హత ఉన్న ఇళ్లకు సౌర విద్యుత్ పరికరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వినియోగించుకోవడంతో విద్యుత్ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ప్యానెళ్ల ద్వారా నెలకు 200 యూనిట్ల వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అందులో 60 యూనిట్ల విద్యుత్‌ను వినియోగదారుడు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. మిగిలిన 140 యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఇలా అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించడం ద్వారా సంబంధిత కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఈ విధానంతో ఏడాదికి సుమారు రూ.5 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని వార్తలో పేర్కొన్నారు. సౌర విద్యుత్ వినియోగం పెరగడం వల్ల సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఇంటి అవసరాలకు విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించే అవకాశం లభిస్తుంది. రెండో దశలో 43 వేల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చేపడుతున్న ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత పథకం అమలులో మరింత వేగం పెరిగే అవకాశం ఉంది. సూర్య ఘర్ పథకం ద్వారా కుప్పం నియోజకవర్గంలోని పెద్ద సంఖ్యలో కుటుంబాలకు సౌర విద్యుత్ ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయి.

కుప్పం నియోజకవర్గానికి 1,000 పక్కా గృహాలు మంజూరు:పి డి

మహిన్యూస్, కుప్పం ఆగస్ట్ 19: కుప్పం నియోజకవర్గంలోని ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద కుప్పం నియోజకవర్గానికి 1,000 పక్కా గృహాలు మంజూరైనట్లు పీడీ తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి వారికి పక్కా ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న అనేక కుటుంబాలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుంది. ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని నిబంధనల ప్రకారం చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇళ్ల మంజూరుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. అలాగే నియోజకవర్గంలో హౌసింగ్‌కు సంబంధించిన ఇతర సమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా హౌసింగ్ పథకాలను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1,000 పక్కా గృహాల మంజూరుతో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఎంతో ఊరట లభించనుంది.

బంగారుపాళ్యం పట్టణంలో

ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన బంగారుపాళ్యం పోలీసులు

చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం ఆగస్టు 19.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుపాళ్యం ప్రాంతంలో బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు మరియు వారి సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు భద్రతపై అవగాహన బుధవారం కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నేరాల నివారణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించి అంశాలపై అప్రమత్తంగా

ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత పై ఒక బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు.ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని పేర్కొన్న పోలీసు-ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేసి "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" లక్ష్యాన్ని విజయవంతంగా అమలు చేయగలమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులుతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

వైద్య సేవలు పక్కనపెట్టి 'వైరల్' ఆరా తీస్తున్న సిబ్బంది!

నాయుడుపేట సి హెచ్ సి నిర్వాహకంపై మండిపడుతున్న ప్రజలు.

నాయుడుపేట, ఆగస్టు 19, మహి న్యూస్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం తిరుపతి జిల్లాలోని నాయుడుపేట పట్టణ ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీరుగారిపోతోంది. ఆసుపత్రి సిబ్బంది బాధ్యతారాహిత్యం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్య వైఖరిపై తిరుపతి జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో ఆసుపత్రి పనివేళల్లోనే ఎక్స్‌రే రూమ్‌కు తాళాలు వేసి ఉన్న దృశ్యాలు బుధవారం వెలుగులోకి వచ్చాయి. అక్కడున్న పరిస్థితులపై వచ్చే పేషెంట్లు ఎక్కడికి వెళ్లాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ సిబ్బంది తీరులో మార్పు రాలేదు. బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లను గాలికి వదిలేసి, ఏడుకొండలు అనే మహిళా ఎక్స్‌రే టెక్నీషియన్ సహా కొందరు సిబ్బంది ఫోటోలు ఎవరు తీశారు, సోషల్ మీడియాలో ఎవరు పెట్టారనే కోణంలో ఆరా తీయడంలోనే నిమగ్నమయినట్టు సమాచారం.

బాధ్యతల కంటే 'కవర్ అప్'పైనే శ్రద్ధ.

రోగులకు వైద్యం అందించడం కంటే తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఎక్స్‌రే రూమ్‌కు తాళం వేసిన సమయంలో అసలు మెడికల్ ఆఫీసర్, ఇతర డాక్టర్లు విధుల్లో ఉన్నారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్లు అందుబాటులో ఉంటే ఎక్స్‌రే రూమ్‌కు తాళం వేసే అవకాశం ఉండదని, ఈ విషయంపై జిల్లా అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నాయుడుపేట సిబ్బందిపై, ఎక్స్‌రే టెక్నీషియన్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, అసుపత్రిలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ప్రతిక్షణం పర్యవేక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

గ్రద్దగుంట గ్రామ సచివాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆకస్మిక తనిఖీ

ఓజిలి, మహి న్యూస్, ఆగస్టు 19 : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎన్ఐఆర్--2026) ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆకస్మికంగా పరిశీలించారు. సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డితో కలిసి ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామ

సచివాలయంలో నిర్వహిస్తున్న ఎన్ఐఆర్--2026 ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న బిఎల్ఓలు (బూత్ లెవల్ అధికారులు), బిఎల్ఏ లు మరియు ఇతర సిబ్బంది హాజరు, వారికి కేటాయించిన విధులు, ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి

తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన నో-మ్యాపింగ్ కేసులు, అనమలీస్ కేసులు తదితర వివరాలను పరిశీలించి, కేసుల వారీగా పురోగతిని సమీక్షించారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత ఓటర్ల వివరాల మ్యాపింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మ్యాపింగ్ సాధ్యం కాని కేసుల్లో సంబంధిత ఓటర్ల నుంచి నిబంధనల ప్రకారం అవసరమైన ఆధారాలను సేకరించి, బిఎల్ఓలు క్షేత్రస్థాయి విచారణ అనంతరం సంబంధిత వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, నిర్ణీత విధానంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పేరు, ఇంటిపేరు, సంబంధం, జనన తేదీ తదితర వివరాల్లో వ్యత్యాసాల కారణంగా ఏర్పడిన అనమలీస్ కేసులును క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల వివరాల్లో వయస్సు లేదా ఇతర డేటాలో వ్యత్యాసాలు ఉంటే, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల మేరకు సవరణలు చేపట్టాలని తెలిపారు. తల్లిదండ్రులు మరణించిన కేసులు, వయస్సు లేదా జనన సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక కేసులు వంటి వాటిలో అవసరమైన డిక్లరేషన్లు, ధ్రువపత్రాలు, విచారణ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, ప్రతి కేసుకు సంబంధించిన పత్రాలను భద్రపరచి, బిఎల్ఓ మరియు ఏఈఆర్ఓ స్థాయిలో చేపట్టిన విచారణకు సంబంధించిన రికార్డులు స్పష్టంగా ఉండేలా చూడాలన్నారు. ఎన్ఐఆర్--2026 ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటర్ల వివరాల మ్యాపింగ్ ఎందుకు నిర్వహిస్తున్నారో, పేరు లేదా ఇతర వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే వాటిని ఎలా సరిచేసుకోవచ్చో ప్రజలకు వివరించాలని బిఎల్ఓ, బిఎల్ఏ లను ఆదేశించారు. ప్రజల నుంచి అవసరమైన ఆధారాలను స్వీకరించి, వారి సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఉండకుండా, అర్హత మరియు నివాస వివరాల ఆధారంగా ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా మ్యాపింగ్ ప్రక్రియలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. వలస వెళ్లిన ఓటర్ల వివరాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన వారి ఓటు హక్కు నిరంతరంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్ఐఆర్--2026లో గుర్తించిన ప్రతి నో-మ్యాపింగ్, అనమలీస్ కేసును నిర్లక్ష్యం చేయకుండా కేసు వారీగా విచారణ, ఆధారాల పరిశీలన, రికార్డు నిర్వహణ మరియు ఆన్‌లైన్ అప్‌లోడింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ కేసులు లేకుండా నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బంది తమకు ఎదురవుతున్న వివిధ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నిబంధనల ప్రకారం ప్రతి కేసును పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన మార్గదర్శకాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓజిలి తహసీల్దార్ అశోక్ రెడ్డి, సంబంధిత ఎన్నికల అధికారులు, బిఎల్ఓలు, బిఎల్ఏ లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలను పకడ్బందీగా చేపట్టాలి

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 19: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు సమగ్ర ముందస్తు ప్రణాళికతో ఎన్నికల సన్నాహాలను చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. బుధవారం విజయవాడ నుండి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సన్నాహాలు, ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సమీకరణ, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఎన్నికల నిర్వహణ అత్యంత సమయపరిమితితో కూడుకున్న బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ప్రతి అంశానికి ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి, ఎంపీటీసీ--జెడ్పీటీసీ ఫారాలు, బుక్‌లెట్లు, శిక్షణ తదితర ముందస్తు ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇమీఎ) ద్వారా ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్లు, స్వీప్ కార్యక్రమాలు, పరిశీలకుల నియామకం, నామినేషన్లు, నోటీసులు తదితర ఎన్నికల ప్రక్రియలను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, సూచనలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ప్రతి నిర్ణయం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా అధికారులు వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిష్పాక్షికత అత్యంత కీలకమని, ఏ అభ్యర్థి లేదా వర్గానికి అనుకూలంగా వ్యవహరించారనే అనుమానం కూడా రాకుండా అధికారులు తమ విధులను నిర్వర్తించాలన్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో న్యాయపరమైన పరిశీలనకు లోనయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి దశలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో తీసుకునే నిర్ణయాలు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేసి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు. పట్టణ స్థానిక సంస్థలు, జెడ్పీటీసీ--ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నిర్దేశించిన సమయపట్టిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సిబ్బంది, ఎన్నికల సామగ్రి, రవాణా, భద్రత తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, కొత్త మండలాలు, జిల్లా పరిషత్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలని అన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఓటర్ల జాబితాల ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అనంతరం పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ, ప్రచురణ ప్రక్రియను కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అష్యూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్ (ఇావీఖీ) అందుబాటులో ఉండేలా ముందుగానే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరును వివరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలో 622 గ్రామ పంచాయతీలు, 5,914 వార్డులు, నాలుగు పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని తెలిపారు. పలమనేరు, నగరి, చిత్తూరు, కుప్పం మున్సిపాలిటీల్లో కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సిబ్బంది నేరుగా సందర్శించి తనిఖీ చేస్తున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, లోపాలు, అవసరమైన మార్పులను గుర్తించి, వాటి ఆధారంగా మ్యాపింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ల తనిఖీ ప్రక్రియను నిర్దేశిత సమయానికి పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా ఓటర్ల తనిఖీ ప్రక్రియను కులాల వారీగా చేపడుతున్నామని, ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన సవరణలు, మార్పులను నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి కోర్టు కేసుల సమస్యలు లేవని, ఎన్నికల ప్రక్రియను కొనసాగించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి న్యాయపరమైన సమస్యలకు అవకాశం లేకుండా ఎన్నికల నిబంధనలు, కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి డైరెక్ట్ పోల్స్, బ్యాలెట్ బాక్సులకు సంబంధించి కొంతమేర సిబ్బంది, ఇతర వనరుల కొరత ఉన్నట్లు గుర్తించామని, ఈ వివరాలను ఇప్పటికే పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమర్పించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. అవసరమైన వనరులను సమకూర్చుకునేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఇచ్చిన సూచనలు, అందజేసిన సమాచారాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను కూడా ముందుగానే పూర్తి చేస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోపాలు, గ్యాప్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పూరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని, నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేసి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. . వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ మోహన్ కుమార్, జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్, డీఎల్‌పీఓ సురేష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టానికి తూట్లు

అధికారుల తీరుపై అర్జీదారు ఆగ్రహం.

వాకాడు, ఆగస్టు 19, మహి న్యూస్: తిరుపతి జిల్లా, వాకాడు మండలంలోని మూడు గ్రామ సచివాలయాల పరిధిలో సమాచార హక్కు చట్టం అమలు తీరు దారుణంగా తయారైందని సూళ్లూరుపేటకు చెందిన ఒక దరఖాస్తుదారుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా సమాచారం అందించాల్సి ఉండగా, కనీసం ఒక్క సచివాలయ పౌర సమాచార అధికారి కూడా గడువులోగా ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంపై ఆయన ఘాటుగా స్పందించారు. పంచాయతీ అభివృద్ధి అధికారులుగా వ్యవహరిస్తున్న ముగ్గురు సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై ఏమాత్రం గౌరవం లేదని ఈ ఘటన తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు. గత రెండేళ్లు, మూడేళ్ల కిందటి రికార్డులు కూడా కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తూ, "కార్యాలయాల్లో అసలు రికార్డులను సక్రమంగా మెయింటెన్ చేస్తున్నారా లేదా" అని ప్రశ్నించారు. ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధి ఇదేనా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటే అన్ని రకాల అర్హత పత్రాలు, ఆధారాలు అడిగి మరీ తనిఖీ చేసే పంచాయతీ అధికారులు, పంచాయతీ అభివృద్ధి పనులు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు సంబంధించిన రికార్డులను ఎందుకు సక్రమంగా నిర్వహించడం లేదని అన్నారు. సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పీఐఓలపై వాకాడు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ప్రథమ అప్పిలేట్ అధికారికి ఇప్పటికే అప్పీలు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈ నిర్లక్ష్యంపై రాష్ట్ర సమాచార కమిషన్‌కు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయనున్నట్లు దరఖాస్తుదారుడు వెల్లడించారు.

ఓజిలి -నాయుడుపేట మండలాల పరిధిలో

ఏపీఐఐసీ భూసేకరణపై సమీక్ష

ఓజిలి, మహి న్యూస్, ఆగష్టు 19 : జిల్లాలోని ఓజిలి, నాయుడుపేట మండలాలకు సరిహద్దుగా ఉన్న కుండం, కారూరు, మచ్చవరం, మనవాలి, కర్రబల్లవోలు, ఐపీ--అత్తివరం, ఐపీ--నాయుడుపేట, ఎమ్‌పిఎస్‌ఈజెడ్ గ్రామాలకు సంబంధించి రూపొందించిన ఉమ్మడి పటాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ ఉమ్మడి గ్రామ పటం, గ్రామ సరిహద్దులు, పారిశ్రామిక సరిహద్దులు, ఏపీఐఐసీ ద్వారా భూసేకరణకు సంబంధించిన భూముల వివరాలను పరిశీలించారు. కుండం, కారూరు, మచ్చవరం, మనవాలి తదితర గ్రామాలకు సంబంధించి మ్యాప్‌లో చూపించిన భూ విస్తీర్ణం, గ్రామ సరిహద్దులు, పారిశ్రామిక ప్రాంతాల పరిధి, ఏపీఐఐసీ భూసేకరణకు సంబంధించిన వివరాలను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యేకంగా ఐపీ--అత్తివరం, ఐపీ--నాయుడుపేట, ఎమ్‌పిఎస్‌ఈజెడ్ పరిధిలోని పారిశ్రామిక సరిహద్దులు, సంబంధిత గ్రామాల భూసరిహద్దులతో సమన్వయం చేసుకునే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన రికార్డులు, మ్యాప్‌లో చూపించిన వివరాలు పరస్పరం సరిపోలేలా పరిశీలించి, అవసరమైన చోట స్పష్టత తీసుకురావాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో గ్రామాల వారీగా భూముల విస్తీర్ణం, సరిహద్దులు, పారిశ్రామిక అవసరాల కోసం గుర్తించిన భూమి తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన చేసి, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిబంధనల మేరకు, పారదర్శకంగా మరియు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఓజిలి తహసీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు రేపు

కలెక్టరేట్లో అందుబాటులో ఉంటారు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 19: ప్రత్యేక విస్తృత సవరణ, 2026లో ముసాయిదా ఓటర్ల జాబితా 31.07.2026 న ప్రచురించడమైనది. దీనిపై ఓటర్ల జాబితా పరిశీలకులు శ్రీ మల్లికార్జున్, ఐ.ఎ.ఎస్., డైరెక్టర్ బి.సి. వెల్ఫేర్, ఆంధ్ర ప్రదేశ్, విజయవాడ వారు 20.08.2026వ తేదీన మొదటివిడతగా చిత్తూరు జిల్లాకు విచ్చేయుచున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు సదరు పరిశీలకుల వారు 20.08.2026వ తేది ఉదయం 10.00 గంటల నుండి 2.00 -గంటల వరకు చిత్తూరు జిల్లా కలెక్టరు వారి కార్యాలయము నందు అంధుబాటులో వుంటారని తెలియజేయడమైనది.

1. ఓటర్ల జాబితా పరిశీలకులు వారి ఫోన్ నెంబరు:6302053082
2. లైసన్ అధికారి వారి ఫోన్ నెంబరు: 9440818068.

వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు మరియు పుర ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలవచ్చునని పై ప్రకటనలో తెలిపారు.

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలపై ఈనెల 22వ తేదీన కాణిపాకం ఈవో కార్యాలయం నందు - సమన్వయ సమావేశం

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 19: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో 2026 బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులతో ఈనెల 22వ తేదీన కాణిపాక ఈవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో, ఉత్సవాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు అన్ని శాఖల అధికారులు హాజరుకావలెను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ సమావేశానికి పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎక్సైజ్ తదితర శాఖలకు చెందిన అధికారులు హాజరుకానున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరై ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన చర్యలపై సమగ్రంగా చర్చించనున్నారు పై ప్రకటనలు. తెలిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com